క్లుప్తంగా

విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

అలరించిన హరికథాగానం

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన కె.ప్రమీల భాగవతారిణి వారిచే శివపార్వతుల కల్యాణంపై హరికథాగానం నిర్వహించారు. కార్యక్రమానికి తబలా సహకారాన్ని బాబురావు, హార్మోనియం సహకారాన్ని వై.మురళి అందించారు.

శ్రీశైలంలో యోగా కార్యక్రమం



యోగా శిక్షణలో పాల్గొన్న దేవస్థాన సిబ్బంది, భక్తులు, స్థానికులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన సిబ్బంది, స్థానికులు, భక్తుల సౌకర్యార్థం ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం చంద్రవతి కల్యాణ మండపంలో ఉదయం 7గంటల నుంచి 8.30 గంటల వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలుకు చెందిన ప్రముఖ యోగా గురువు గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం వారిచే శిక్షణ ఇస్తున్నారు. అందరిచేత ధ్యానం చేయించి, సూక్ష్మ వ్యాయామాన్ని చేయించారు. అలాగే అనులోమా, విలోమా, బస్త్రిక ప్రాణాయామాలు చేయించి, పలు యోగాసాలు చేయించారు. యోగాపై అవగాహన కల్పించేందుకు ఉచిత శిక్షణ ఏర్పాటు చేశామని దేవస్థాన ఈఓ తెలిపారు.

శ్రీశైలం నుంచి మహానందికి బదిలీ

మహానంది: మహానంది దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ శ్రీశైలం ఆలయానికి బదిలీపై వెళ్లిన ఎస్.హరినాథ్ తిరిగి మహానంది దేవస్థానానికి బదిలీ అయ్యారు. ఇటీవల జరిగిన బదిలీలో భాగంగా శ్రీశైలం దేవస్థానానికి వెళ్లారు. అయితే హరినాథ్ ఆగస్టులో రిటైర్డ్ అవనున్న నేపథ్యంలో ఆయన అభ్యర్థన మేరకు రిపాట్రియేషన్(స్వదేశం, మాతృసంస్థకు పంపడం)లో భాగంగా మహానందికి బదిలీ చేస్తూ దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ టి.చంద్రకమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రెండు దేవస్థానాల కార్యనిర్వహణాధికారులకు ఉత్తర్వులు పంపించారు.

తరగతి గదులు ప్రారంభం



నూతన గదులను ప్రారంభిస్తున్న దాతలు వెంకటనారాయణరెడ్డి, జయసుధ

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన అదనపు గదులను దాతలు ఆవుల వెంకటనారాయణరెడ్డి, ఆయన సతీమణి జయసుధ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో స్వర్ణోత్సవాల సందర్భంగా తాము ఇచ్చిన హామీ మేరకు రూ.15 లక్షలు వెచ్చించి అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టామన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న ఆధ్వర్యంలో దాతలు ఆవుల వెంకటనారాయణరెడ్డి, జయసుధ దంపతులను ఘనంగా సన్మానించారు.

తంగడంచ ఫారం భూములను కౌలురైతులకివ్వాలి

జూపాడుబంగ్లా: అభివృద్ధిపేరుతో ప్రైవేటు కంపెనీలకు ఇచ్చిన సారవంతమైన తంగడంచ ఫారం భూములను వెనక్కి తీసుకుని కౌలురైతులకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం నాయకులు తంగడంచ ఫారం భూములను పరిశీలించారు. తక్కువ ధరకు జైన్ కంపెనీకి 624ఎకరాలు, అంబుజా కంపెనీకి 211 ఎకరాలు కట్టబెట్టి నిరుపయోగంగా మార్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కౌలురైతులకు లీజుకివ్వాలని, లేని ఎడల ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కర్ణ, గోపాలకృష్ణ, శ్రీను, రాము, ఓబులేసు, లింగస్వామి పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు అవకాశం

నందికొట్కూరు: ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా వేసిన వెంచర్లను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించినట్లు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి రంగస్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 30 వరకు రిజిస్టర్ అయిన అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హోటల్ నిర్వాహకులు శుభ్రత పాటించాలి

- హోటల్ నిర్వాహకులతో ఈఓ ఎం.శ్రీనివాసరావు



హోటల్ నిర్వాహకులకు సూచనలిస్తున్న దేవస్థాన ఈఓ, పాల్గొన్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం పరిధిలోని హోటల్ నిర్వాహకులు శుచీ, శుభ్రతను పాటించాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం శ్రీశైలంలోని మల్లికార్జున కల్యాణమండపంలో దేవస్థాన పరిధిలోని హోటల్ నిర్వాహకులతో దేవస్థాన అధికారులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి నంద్యాల జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ హోటల్ నిర్వాహకులు ఎప్పటికప్పుడు తాజా కూరగాయలనే వాడాలన్నారు. పాత్రలను కూడా తరచూ శుభ్రపరుస్తుండాలన్నారు. నిల్వ ఆహర పదార్థాలను అందించరాదని సూచించారు. ఆహార పదార్థాల తయారీలో వినియోగించే వస్తువులు పూర్తి నాణ్యతతో ఉండాలన్నారు. హోటల్స్‌లో పనిచేసే వారు భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. నాణ్యమైన ముడిసరుకుతో రుచికరమైన ఆహారాన్ని భక్తులకు అందజేయాలని అన్నారు. ప్రతి నెలలో రెండుసార్లు రెవెన్యూ, శానిటేషన్, ఫుడ్ఇన్స్పెక్టర్లతో ఆహార పదార్థాలపై, హోటల్ నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు చేయిస్తామన్నారు. అనంతరం ఫుడ్‌సేఫ్టీ అధికారులు మాట్లాడుతూ హోటల్ నిర్వాహకులందరు ఆహార పదార్థాల తయారీలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐ.వి.ఆర్ సిస్టం ప్రకారం ప్రతి ఒక్కరు ఆహార పదార్థాలను సిద్ధం చేయాలని, టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్స్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. ప్రతి హోటల్ తప్పనిసరిగా ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ వారియొక్క లైసెన్సును కలిగి ఉండాలన్నారు. ఎంఆర్‌పి రేట్లకు మించి అధికధరలకు విక్రయిస్తే లీగల్ మెట్రాలజీ శాఖ తగిన చర్యలు తీసుకోనబడతాయని అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ జి.మల్లికార్జునరెడ్డి, పీఆర్వో టీ.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు డి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాటిపాడు, తర్తూరు ఎంపీటీసీ ఎన్నికలు జరిగేనా...?

- మొదటి నుంచి ఖాళీగా ఉన్న ఎంపీటీసీ స్థానాలు

జూపాడుబంగ్లా: మండలంలో ఖాళీగా ఉన్న తాటిపాడు, తర్తూరు ఎంపీటీసీ స్థానాలకు ఇప్పటికైనా ఎన్నికలు జరిగేనా అని పలువురు చర్చించుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో మండలంలో ఖాళీగా ఉన్న రెండు ఎంపీటీసీ స్థానాలకు ఇప్పటిదాకా ఎన్నికలు నిర్వహించలేదు. 2021 ఏప్రిల్ 8న స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్ర వ్యాప్తంగా జరిగాయి. తర్తూరు గ్రామం నుంచి ఎంపీటీసీ గా ఎన్నికైన పీఎం నాగిరెడ్డి తన ఎంపీటీసీ పదవికి రాజీనామా చేసి సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. తాటిపాడు ఎంపీటీసీగా ఉన్న బోయ చిన్నశంకర్ ఏడాది అనంతరం మృతిచెందాడు. దీంతో తర్తూరు, తాటిపాడు ఎంపీటీసీ స్థానాలు ఖాళీగా ఉండగా ఇప్పటిదాకా వాటికి ఎన్నికలు నిర్వహించలేదు. మండలం వ్యాప్తంగా 11 ఎంపీటీసీ స్థానాలుండగా అందులో రెండు ఎంపీటీసీ స్థానాలు ఖాళీగా ఉండగా ప్రస్తుతం తొమ్మిది మంది ఎంపీటీసీలతోనే మండల సర్వసభ్యసమావేశాన్ని నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఎంపీటీసీ, సర్పంచ్, ఏదేని ప్రజాప్రతినిధి స్థానం ఖాళీ అయినట్లయితే దానికి ఆరుమాసాల్లోగా ఎన్నికలు నిర్వహించటం ద్వారా ఆ స్థానాన్ని భర్తీచేయాల్సి ఉంది. అయితే మండలంలో నాలుగేళ్లు, మూడేళ్ల కాలంగా ఖాళీగా ఉన్న తర్తూరు, తాటిపాడు ఎంపీటీసీ స్థానాలకు ఇప్పటిదాకా ఎన్నికలు నిర్వహించకపోవటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసిన నేపథ్యంలో తర్తూరు, తాటిపాడు గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ ఇవ్వకపోవటం కారణమేంటని ఆయా గ్రామాల్లోని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ గోపికృష్ణను వివరణ కోరగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న కొన్ని ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు సంబంధించి కోర్టుకెళ్లటంతో వాటికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

- ఏడీఏ సరళమ్మ



మందులను చూపుతున్న ఏడీఏ, ఏఓలు

పాములపాడు: మొక్కజొన్న పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం నంద్యాల ఏడీఏ సరళమ్మ సూచించారు. బుధవారం ఇస్కాల గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నానో యూరియా, డీఏపీలను పైర్లపై పిచికారీ చేయడం వల్ల ఖర్చు తగ్గుతుందన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను తప్పని సరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు నంద్యాల హేమ సుందర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

స్కావెంజర్లకు వేతనాలు పెంచాలి

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లకు వేతనాలను పెంచాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ కోరారు. ధనుంజయ మీటింగ్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన స్కావెంజర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, వేతనాలను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్కావెంజర్లపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో స్కావెంజర్లు ప్రభావతి, హసీనా, ఖాజాబీ, హుసేన్, రమిజాబీ, నాగమ్మబాయి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఆత్మకూరు: మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారిణి హేమలత సూచించారు. కరివేన, నల్లకాల్వ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు తప్పనిసరిగా బ్యాంకుల్లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే 31వ తేదీలోపు పంటల బీమా చేయించుకునేందుకు అవకాశం ఉందన్నారు.

- కరివేన గ్రామంలోని రైతుసేవా కేంద్రం వద్ద రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఏఓతోపాటు ఏఈఓ సతీష్, రాజశేఖర్ పాల్గొన్నారు.
- మహానంది: సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి కోరారు. మసీదుపురం, అయ్యన్ననగర్ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు.
- బండి ఆత్మకూరు: రసాయన ఎరువులకు స్వస్తి పలికి, సేంద్రియ ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.పవన్ కుమార్ రైతులకు సూచించారు. పెద్దదేవలాపురం, భోజనం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో వెటర్నరీ డాక్టర్ అనూషతో కలిసి పాల్గొన్నారు.
- జూపాడుబంగ్లా: పంటలకు తగిన మోతాదులో ఎరువులు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. పారుమంచాల, తూడిచెర్ల గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు సలహాలిచ్చారు.

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

పాములపాడు: గ్రామ కఠం భూములు, ఇళ్లను సర్వే చేసి యజమానులను గుర్తించి పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికను ఉపయోగించి సర్వే చేస్తున్నాట్లు చెప్పారు. అనంతరం టీఓటీ ఇస్కాల గ్రామ సర్వేయర్ అబ్దుల్ మన్నన్ శిక్షణ ఇచ్చారు.

2న సర్వసభ్య సమావేశం

పాములపాడు: ఆగస్టు 3వ తేదీకి బదులు ఒక రోజు ముందుగా 2వ తేదీన నిర్వహించనున్నామని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల 3వ తేదీ నిర్వహించాల్సిన సమావేశం 2వ తేదీనే నిర్వహిస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు గమనించి హాజరు కావాలని కోరారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఆత్మకూరు: రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, లేనిపక్షంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపడతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, పట్టణ పౌరసమాఖ్య నాయులు రణధీర్, సురేంద్రలు అన్నారు. బుధవారం పట్టణంలో స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు ముందు స్మార్ట్ మీటర్లపై పోరుబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ యాత్ర పట్టణంలోని గరీబ్‌నగర్, స్వరాజ్‌నగర్, ఇంద్రానగర్, సాయిబాబానగర్, ఏకలవ్యనగర్, లక్ష్మీనగర్ కాలనీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టాలని చెప్పి నేడు అదే స్మార్ట్ మీటర్లను బిగించడం ఏమిటని ప్రశ్నించారు. 20 వేల కోట్ల సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపారన్నారు. స్మార్ట్‌మీటర్లను తొలగించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు నాగేశ్వరరావు, మహమ్మద్, సత్యం, సామేలు, ఆశీర్వాదం, తుమ్మలూరు శివకుమార్, నూర్, ప్రతాప్, వెంకట్ పాల్గొన్నారు.

సబ్ జైలును తనిఖీ చేసిన జడ్జి



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి అమ్మన్న రాజ

నంద్యాల (వ్యవసాయం): నంద్యాల సబ్ జైల్లో బుధవారం సాయంత్రం మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజ ఆకస్మిక తనిఖీ చేశారు. ఖైదీల సంఖ్య, వారి ఆరోగ్యం తదితర వివరాలను సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. జైలు పరిసరాలను పరిశీలించి వంట గదులు, , ఖైదీల గదులు పరిశీలించారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న వారు సత్ప్రవర్తలతో జీవించడానికి ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది బాలునాయక్, రామచంద్రారెడ్డి, సూపరింటెండెంట్ గురు ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం



కస్తూరి విజయమ్మను సన్మానిస్తున్న సీఎస్ఐ టౌన్ చర్చి సంఘస్తులు

నందికొట్కూరు: సీఎస్ఐ ఎయిడెడ్ హైస్కూల్ సోషల్ టీచర్ కస్తూరి విజయమ్మ పదవీ విరమణ కార్యక్రమం బుధవారం సీఎస్ఐ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సీఎస్ఐ టౌన్ చర్చి సెక్రటరీ అంబమ్మతోపాటు సంఘ సభ్యులు రవికుమార్, జయచంద్ర, నాగన్న, జాన్ క్రిసోష్టమ్, నాగేశ్వరరావు, నాగేంద్ర, రమేష్, తదితరులు విజయమ్మను సన్మానించారు.

సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా




తిమ్మాపురంలో అవగాహన కల్పిస్తున్న ఏఈఈ ప్రభాకర్ రెడ్డి

మహానంది: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా గృహవినియోగదారులు సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకుంటే విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ప్రభాకర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం, అబ్బీపురం గ్రామాల్లో వినియోగదారులకు అవగాహన కల్పిస్తూ సోలార్ ఏర్పాటుపై వివరించారు. ఆయన మాట్లాడుతూ సబ్సిడీతో ఏర్పాటు చేసుకునే ఒకటి, రెండు, మూడు కిలోవాట్ రూఫ్‌టాప్‌ల ద్వారా ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ప్రస్తుతం వస్తున్న బిల్లుల కంటే అత్యంత తక్కువ మొత్తంలో ఖర్చు అవుతుందన్నారు. లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరికి ఏర్పాటు చేసేందుకు సిబ్బంది సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు

కొత్తపల్లి: దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ సబ్ యూనిట్ అధికారి క్రిష్టారెడ్డి సూచించారు. బుధవారం గువ్వలకుంట్ల గ్రామ ఎస్సీ కాలనీని సందర్శించారు. వారం రోజుల నుంచి జ్వరాలతో బాధపడుతున్న వారిని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వాతావరణ మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. నీటిని కాచి వడబోసి, చల్లార్చుకుని తాగాలని ప్రజలకు సూచించారు. రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలన్నారు. జ్వరం, దగ్గు, జలుబు తగ్గకపోతే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి చికిత్స పొందాలన్నారు.

జీఎన్ఎస్ఎస్‌కు నీటి విడుదల పెంపు



జీఎన్ఎస్ఎస్ గేట్లలోకి వెళ్తున్న నీరు

- తెలుగుగంగకు తగ్గింపు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి జీఎన్ఎస్ఎస్‌కు బుధవారం నీటి విడుదల పెంచినట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి 30 వేల నుంచి వెయ్యి క్యూసెక్కులు పెంచి 31 వేల క్యూసెక్కుల నీరు ఎస్ఆర్ఎంసీ ద్వారా ఇన్‌ఫ్లో ఉందన్నారు. కాగా జీఎన్ఎస్ఎస్ కు 8వేల నుంచి 10వేల క్యూసెక్కులకు నీటి విడుదల పెంచామని, తెలుగుగంగ(వీబీఆర్)కు 14వేల నుంచి 13వేల క్యూసెక్కులకు తగ్గించామని, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 8వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. కాగా వీబీఆర్‌లో 15 వేలకు పైగా టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు.

బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండాలి



బ్యాంకర్లకు నోటీసులు అందజేస్తున్న ఎస్ఐ

వెలుగోడు: బ్యాంకుల భద్రత విషయంలో ఆయా బ్యాంకుల అధికారులు అప్రమత్తంగా ఉండాలని వెలుగోడు ఎస్ఐ సురేష్ కుమార్ సూచించారు. ఇటీవల బ్యాంకుల్లో చోరీల ఘటనలు వెలుగు చూడటంతో బ్యాంకు అధికారులు తీసుకోవాల్సిన భద్రత చర్యలపై బుధవారం బ్యాంకు అధికారులతో ఎస్ఐ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగదు రవాణా, ఏటీఎంలలో నగదు నింపడం, సీసీ ఫుటేజ్ నిర్వహణ, సెక్యూరిటీ గార్డుల నియామకం, అలారం వ్యవస్థ, రాత్రి భద్రత వంటి అంశాలపై బ్యాంకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు గమనించాలని, కష్టమర్ హెల్మెట్, ఫేస్‌మాస్క్‌తో బ్యాంకు, ఏటీఎంలోకి రాకుండా చూడాలన్నారు. అనంతరం స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, కెనరా బ్యాంకు, స్టేట్ బ్యాంకు, జిల్లా సహకార బ్యాంకు అధికారులకు ఎస్ఐ నోటీసులు అందజేశారు.

అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలి

నంద్యాల(అర్బన్): పీఎం కిసాన్ సమ్మాన్ నిధులతో పాటు అన్నదాత సుఖీభవ నిధులను అర్హులైన రైతుల ఖాతాల్లో తక్షణమే జమ చేయాలని కిసాన్ మోర్చా నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షుడు తూముశివారెడ్డి, ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లతో పాటు స్ప్రేయర్లు, డ్రోన్‌లు అందించి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. జిల్లా రైతుల సమస్యలను ఇటీవల నంద్యాల పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర రథసారథి పీవీఎన్ మాధవ్‌కు వివరించామన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

కొత్తపల్లి: ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఉమారాణి హెచ్చరించారు. బుధవారం కపిలేశ్వరం గ్రామ సమీపంలో ప్రభుత్వ, ఎస్ఏప్వీ భూముల్లో నాటిన మామిడి మొక్కలను రెవెన్యూ సిబ్బందితో తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో దీర్ఘకాలిక పంటలను సాగు చేయరాదన్నారు. నామమాత్రపు పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు.

జూనియర్ జూడో జట్టుకు ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా సబ్ బాలబాలికల జూనియర్ జూడో జట్టు ఎంపిక పోటీలు ఆగస్టు 2వ తేదీన ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ తెలిపారు. పద్మావతినగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఎంపిక కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాకు ఎంపికైన బాలబాలికల జట్టు ఆగస్టు 9, 10 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఎంపికకు వచ్చే బాలబాలికలు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. 2011-13 సంవత్సరాల్లో జన్మించిన వారై ఉండాలన్నారు. ఈ పోటీలు వివిధ కేటగిరిలో జరుగుతాయన్నారు. బాలుర విభాగంలో 30, 35, 40, 45, 50, 55, 60, 66, ప్లస్ 66 విభాగాల్లో, బాలికల విభాగంలో 28, 32, 36, 40, 44, 48, 52, 57, ప్లస్ 57 కేజీల్లో జరుగుతాయన్నారు.

లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్‌గా నిజాముద్దీన్

నంద్యాల(వ్యవసాయం): లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్‌గా నిజాముద్దీన్‌ను నియమించినట్లు మాజీ జిల్లా గవర్నర్ ఇల్లూరి గోపాలకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా చేసిన సేవలకు గుర్తించి ఈసారి జోన్‌కు చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు వెల్లడించారు.ఇక నుంచి జోన్ పరిధిలోని క్లబ్‌లలో సేవలను నిజాముద్దీన్ పర్యవేక్షిస్తారన్నారు.

పంచాయతీల ఆదాయం పెంచాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఓ

కోవెలకుంట్ల: వివిధ ఆదాయ వనరులను ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీల ఆదాయం పెంచాలని జిల్లా పంచాయతీ అధికారిణి లలితాబాయి సూచించారు. బుధవారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం పట్టణ శివారులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానం ఆవరణలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో తడిచెత్త, పొడిచెత్త వేరు చేసే పనులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ వర్మీకంపోస్టును రైతులకు విక్రయించి పంచాయతీలకు ఆదాయాన్ని చేకూర్చాలన్నారు. ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓ పీఆర్డీ ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- జమ్మలమడుగు ఆర్ అండ్‌బీ రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఎల్ఎం కాంపౌండ్‌లో నివాసం ఉంటున్న ఏసేబు (55) గడేకారిగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి సైకిల్‌పై బహిర్భూమికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్కెట్‌యార్డు సమీపంలో కోవెలకుంట్ల వైపు నుంచి వెళ్తున్న స్కూటీ వేగంగా ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో వాహనదారుడైన పట్టణానికి చెందిన సనా ఉల్లాఖాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పాత్రికేయుడికి గాయాలు

డోన్ టౌన్ : ఓ ప్రైవేట్ చానల్‌లో పాత్రికేయుడిగా పని చేస్తున్న రంగన్న బుధవారం కర్నూలు సమీపంలోని పెద్దటేకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వ్యక్తిగత పనుల నిమ్మిత్తం రంగన్న కుటుంబసభ్యులు, సమీప బంధువులతో కలిసి ఆటోలో కర్నూలుకు వెళ్లి.. తిరిగి డోన్‌కు వస్తుండగా కర్నూలు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను వెనుక తాకగా అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న రంగన్నతో పాటు మరి కొందరు గాయపడగా చికిత్సల నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించారు.

పాలేరు వాగులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు- ఉప్పలూరు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న పాలేరువాగులోకి బుధవారం సాయంత్రం ఓ ట్రాక్టర్ దూసుకెళ్లింది. మండలంలోని కలుగొట్లకు చెందిన సుధాకర్ రెడ్డి ట్రాక్టర్‌తో పొలంలో సేద్యం చేసి తిరిగి ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో పాలేరు వాగు సమీపంలో ట్రాక్టర్ ఇంజిన్ అదుపు తప్పి వాగులోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తమై ట్రాక్టర్ నుంచి దూకడటంతో ప్రాణపాయం తప్పింది. రేవనూరు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన కల్పించండి



శిరివెళ్లలో మిద్దెపై ఏర్పాటు చేసిన సౌరశక్తి పలకను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

శిరివెళ్ల: పీఎం సూర్య ఘర్ యోజనపై ప్రజలకు అవగాహన కల్పించాలని డ్వామా పీడీ సూర్య నారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటైన సౌర శక్తి పలకను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ, ఉపాధి పథకం సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలకు విద్యుత్ బిల్లు భారం తగ్గించేందుకు సబ్సిడీపై సూర్య ఘర్ యోజన పథకాన్ని అమలు చేస్తుందన్నారు. పథకం కింద ఇంటిపై సౌర్య శక్తి పలకను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. యూనిట్ బట్టి సబ్సిడీని ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే 120 యూనిట్ల సౌర శక్తి ఉత్పత్తివుంతుందన్నారు. కరెంట్ బిల్లు రూ. వెయ్యి వస్తే అదే సౌరశక్తి విద్యుత్‌కు రూ. 330 బిల్లు వస్తుందన్నారు. ఏడాదికి రూ. 8 వేల ఆదావుతుందన్నారు. 3 కిలో వాట్ సౌర పలకల వ్యవస్థ ఏర్పాటుకు 2.24 లక్షలు ఖర్చువుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 78 వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. అనంతరం ఉపాధి పథకం కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతు ప్రభుత్వం ఉద్యానవన పంటలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. 2025-26 సంవత్సరానికి జిల్లాలో 4500 ఎకరాల్లో ఉద్యానవన పంటలను సాగు చేయాలన్నది లక్ష్యమన్నారు. ఇంత వరకు 1,078 ఎకరాల్లో పంటల సాగుకు సన్నాహాలు జరిగాయన్నారు. జిల్లాలో 59,900 ఇంకుడు గుంతలు తవ్వాలన్నది లక్ష్యం కాగా ఇంత వరకు 1200 గుంతల తవ్వకాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస శర్మ, ఏపీఓ రామసుబ్బయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.